# ఓవర్ యాక్షన్!

"ఒరేయ్ సోంబాబూ! మరీ అంతగా తాగేకురా నీ దుంపతెగ!"

"ఏం తాగితే! కొంపేమన్నా మునిగిపోద్దేటి?"

"మునిగి పోతుందని కాదు నాయనా!" గొణిగాడు గణపతి. "సరాసరి ఆఫీసు నుంచి బార్‌కి లాక్కెళ్ళి నీచేత తప్ప తాగించానని, మీ ఆవిడ నానా తిట్లు తిడుతుంది.

"మా ఆవిడకెట్లా తెలుస్తుందోయ్ మనం తాగామని? సోగ్గా అడిగాడు సోంబాబు.

"వెనుకటికో ఎధవ ముండని చూసి మామ్మగారూ మీ ఆయన పోయి ఎన్నాళ్ళైందీ అంటే అయ్యో నాయనా! మా ఆయన పోయినట్టు నీకెలా తెలుసు అందిట. అల్లా వుంది నువ్వు చెప్పేది. మనం చేసే ఓవరేక్షన్ చెపుతుందోయ్ మనం తాగామని" అన్నాడు గణపతి.

"అంటే తాగి నేను ఓవరేక్షన్ చేస్తానంటావా? కొంచెం రైజయ్యాడు సోంబాబు.

"తగ్గవోయ్ బాబ్జీ తగ్గు, నువ్వేకాదు, ఎంత మగాడైనా తాగాడంటే ఓవరేక్షనే" సూత్రీకరించాడు గణపతి.

"ఆల్‌రైట్, ఛాలెంజ్ నేను మామూలుగా యింటికెళితే, ఎలా బిహేవ్ చేస్తానో నీకు తెలుసుగా"

"తెలీకేం నాయనా! ముందుగా కాలింగ్‌బెల్ కొడ్తావ్! తెరిచేలోగా షెల్ఫునో, మేసనో ఏదో ఒకటి చదూతూవుంటావు. తులుపులు తియ్యగాంనే ఎవరు తీశారు అన్నది కూడా చూడకుండా, అలాగే చదూకుంటూ లోపలికి పోతావ్!"

"మరి మందు కొట్టినపుడేం చేస్తాను?"

"అపుడే నీకు ఓవరేక్షనొచ్చేది. సాఫీగా లోపలికి పోవు. బయటే నిలబడి, మీ ఆవిడకి ఏదో ఎక్స్‌ప్లేయిన్ చేయడానికి ప్రయత్నం చేస్తావ్? అదే నువు తాగావని మీ ఆవిడకి పట్టించే అణ్వస్త్రం."

"మరి వాసన రాదేటి?"

"సర్లే, పిప్పరమెంటేసి జర్దా కిళ్ళీ తగిలిస్తే సరి! మన సత్తెకాలపు సత్తెమ్మలకి, జర్దా వాసనా, విస్కీ వాసన కూడా తెలుసేటి?"

"ఆల్‌రైట్, ఛాలెంజ్ గురూ! ఇవ్వాళ నేను తాగినట్లు మా ఆవిడ కేమీ అనుమానం రాకుండా కంట్రోలుగా వుంటాను. ఇదే బెట్" అని పెగ్గు మీద పెగ్గు, పెగ్గు మీద పెగ్గు అరడజను పెగ్గులు లాగించేశాడు.



రాత్రి ఒంటి గంటయింది.

టక్! టక్! టక్! తులపు కొట్టి నాలిక్కరుచుకున్నాడు సోంబాబు! వెంటనే కాలింగ్ బెల్ నొక్కాడు. పుస్తకం అమాంతం వెడల్పుగా, రెండు చేతుల్లో ఎత్తి తెరిచి పట్టుకుని చదవసాగాడు.

అపర్ణ తలుపు తెరిచింది. ఆమెకేసి చూడకుండా, చాలా నార్మల్‌గా పుస్తకం చదువుతూ, కాజువల్‌గా నడుస్తూ హాల్లోకొచ్చాడు సోంబాబు!

ఆశ్చర్యపోయింది అపర్ణ

కనుకొసలనుంచి చూడసాగాడు సోంబాబు! పూర్‌గర్ల్, ఇంతలేటుగా వచ్చిన తను తాగొస్తాడనుకుంది. తను చాలా నార్మల్‌గా వస్తే ఆశ్చర్యపోతోంది. "హ!హ!" అని నవ్వుకుంటూ అలాగే పుస్తకం పట్టుకుని హాల్లోనే నిలబడిపోయాడు

"చాల్లెండి వెధవ నటనా, మీరూనూ! అంతలా చెడ తాగెయ్యకపోతే కొంపేం మునిగిపోయిందట?" గయ్యిమంది అపర్ణ.

"అరే! ఇవాళ్ళక్కొంచెం ఓవర్ర్ అయిన మ్మాట న్నిజమే కాని, నేన్ చాలా నార్‌మల్‌గానే వున్నానే? నీక్కెలా తెలిసింది అపర్ణా!" అన్నాడు సోంబాబు విస్తుపోతూ

గుమ్మంలో పడ్డ ఫైళ్ళూ కాగితాలు ఏరి చేత్తో పట్టుకుని, "ఎలా తెలిసిందో తర్వాత చెప్తాను గానీ, ముందు చదువుతున్న ఆ బ్రీఫ్‌కేస్ ముడిచి వంటింట్లోకి పదండి, కాలీఫ్లవర్ చేశాను మీకోసం" అంది అపర్ణ.